క్లుప్తంగా

విద్యార్థినుల స్వచ్ఛత ప్రతిజ్ఞ

- ఎన్టీపీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా ప్రారంభం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీపీసీ జీజీఎం ఎస్.కె. సిన్హా, విద్యార్థినులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దీపాంజలి నగర్‌లో మంగళవారం ఉదయం జీజీఎంతో పాటు సంస్థ ఉద్యోగులు, సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు, దీపాంజలి నగర్ వాసులు, విద్యార్థులు మారినింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం జీజీఎం సిన్హా ఉద్యోగులతో స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో బాలికలతో సామూహిక స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా పాల్గొన్నారు.

50 మంది రక్తదానం



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందిస్తున్న మహేష్

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని టీచర్స్ లేఅవుట్ పార్కులో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మదర్ అండ్ అమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. 50మంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. మెంటి మహేష్ రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎన్ మూర్తి, నూకరాజు, రమణ, వరహాలు, సత్యనారాయణ, డి.రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం



విద్యార్థులకు గేయాలు నేర్పిస్తున్న రాజేంద్రప్రసాద్

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం ఇండోర్ గేమ్స్, బాలల గేయాల ఆలాపన కార్యక్రమాలు జరిగాయి. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బి.బి.రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గేయాలను నేర్పించారు. ప్రతీ విద్యార్థి వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్మికనేత సూర్యనారాయణ రాజు, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, ఉద్యోగి యల్లమ్మ, పాఠకులు మోహన్, లక్ష్మణ్, అజయ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రుచిలో మేటి.. సింహగిరి పనస

వేసవిలో లభించే పళ్లలో పనసకి ఒక ప్రత్యేకత ఉంది. అందులోనూ సింహగిరిపై పండే పనసకి మరింత ప్రత్యేకత వుంది. ఏటా వేసవిలో సింహగిరిపై పండుతున్న పనస పళ్లను శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు విరివిగా కొనుగోలు చేస్తుంటారు.

- రుచి చూసేందుకు కొనుగోలుదారుల ఉత్సాహం
- ఈ ఏడాది మార్కెట్‌లో విరివిగా లభ్యం



పనస పండ్లు



పనస తొనలు



పనస తొనలు తీస్తున్న రైతు

సింహాచలం : సింహగిరి పనస రుచి చూసేందుకు విశాఖ నలుమూల నుంచి పనిగట్టుకుని మరీ పలువురు వస్తుంటారు. కొందరు భక్తులు పనస తొనలని స్వామికి నైవేద్యంగా పెడుతుంటారు. రుచిలో అమోఘమైన ఈ పళ్లలో పలు రకాలు కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

వర్షాధారం పైనే ఆధారం..

ఎన్నో పుట్టు ధారలకు నిలయంగా విరాజిల్లుతున్న సింహగిరి కొండల్లోని తోటల్లో పనస పండుతోంది. ఇక్కడ వున్న పెదలోవ, సిరిముల్లోవ, కోడిపట్టు లోవ, బరిలోవ, బగాదిలోవ తదితర లోవల్లో పనస ఎక్కువగా పండుతోంది. పూర్తిగా వర్షాధారంపైనే పండే ఇక్కడి పనసకి ఇంతటి తియ్యదనం రావడానికి కారణం కూడా సింహగిరి కొండల్లో ఉన్న పుట్టుధారల్లో ఉన్న స్వచ్ఛదనం, మాధుర్యమేనని పలువురు చెబుతుంటారు. ముఖ్యంగా ఇక్కడి కొండల్లో పలుచోట్ల పండే కజ్జా పనస, తేనె పనస, కొబ్బరి పనస, పంచదార పనసకి ఉన్న డిమాండే వేరు. వాటికోసం కొనుగోలుదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటారు. ఎప్పుడెప్పుడు పనస వస్తుందా అని నిరీక్షిస్తుంటారు. అటవీ ప్రాంతాన్ని తలపించే ఈ కొండల్లోకి చొచ్చుకుని వెళ్లి రైతులు పనసను పండిస్తుంటారు. కొందరు రైతులు ఉదయం కొండల్లోకి వెళ్తే సాయంత్రానికి తిరిగి వచ్చే పరిస్థితులు కూడా ఉన్నాయి. తలపై పెట్టుకొని కొండల్లోంచి కాలినడకన దిగువ ప్రాంతానికి తీసుకొస్తుంటారు. ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదు. అలా కొండ దిగువకి తీసుకొచ్చిన పనస పళ్లను రైతులు భక్తులకు విక్రయిస్తారు. కొందరు చిరు వ్యాపారులు రైతుల వద్ద పనసని కొనుగోలు చేసి విక్రయాలు జరుపుతుంటారు. అలాగే పనస తొనలను కూడా విక్రయిస్తుంటారు. వేసవిలో వీరికి పనస విక్రయాలే జీవనాధారం. ప్రస్తుతం సింహగిరి పైన బస్టాండ్, ఘాట్‌రోడ్డు, కొండ దిగువ కాపుదిబ్బ తదితర ప్రదేశాల్లో పనస విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సైజు, రకాన్ని బట్టి వంద రూపాయల నుంచి మూడు వందల రూపాయల వరకు పనస పళ్ల విక్రయం సాగుతోంది. గడచిన కొన్నేళ్లుగా పనస దిగుబడి అంతంతమాత్రంగానే ఉండటం, హుద్‌హుద్ సమయంలో పనస చెట్లు నేల కొరగడం, కరోనా సమయంలో విక్రయాలు సరిగ్గా జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడిన పరిస్థితులు ఉన్నాయి. అయినా తమ జీవనాధారం, వృత్తి పట్ల అంకితభావంతో పనసను సాగు చేస్తూనే ఉన్నారు. ఈ ఏడాది కొంతమేర పనస దిగుబడులు బాగానే ఉన్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గడ్డు పరిస్థితులను అధిగమించి..



గడచిన కొన్నేళ్లుగా పనస దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. అయినా దాన్ని పట్టించుకోకుండా ముందుకు వెళ్తున్నాం. ఈ ఏడాది పనస దిగుబడి బాగానే ఉంది. విక్రయాలు కూడా బాగానే సాగుతున్నాయి. సింహగిరి కొండల్లో పండే పనసకి ఉన్న ప్రత్యేకతతో ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కజ్జా పనస, పంచదార పనసలని భక్తులు ఎక్కువగా అడుగుతున్నారు.

– తిమదాని సూరిబాబు, పనసపళ్ల వ్యాపారి

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ ర్యాలీ

పరవాడ: ప్రకృతి మన కోసం కాదని, ప్రకృతి కోసమే మనమని సీనియర్ ఎన్విరానిమెంటల్ ఇంజినీర్ (ఏపీపీసీబీ) ఎం.నాగార్జున అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కాలుష్య నివారణ సంస్థ, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జేఎన్ ఫార్మాసిటీలో మంగళవారం చేపట్టిన సైకిల్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఎంఏఎస్ఆర్ఎం కార్యాలయం నుంచి జేఎన్‌పీసీ, ఎస్ఈజెడ్, మైలాన్ లాబొరేటరీ వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఏఎస్ఆర్ఎం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివరాంప్రసాద్, జెట్టి సుబ్బారావు, ఎస్.ఎస్.రావు, ఎం.ఎ.రాజరాజు, ఫార్మాసిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: రహదారి ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అనకాపల్లి డీఎస్పీ ఎస్.వి. సత్యనారాయణ అన్నారు. లారీ, బస్సు వాహనాల డ్రైవర్లు, యజమానులకు రహదారి ప్రమాదాలపై డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. రహదారి భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. సీఐ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ నాగేశ్వరరావు

డాబాగార్డెన్స్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో రాంనగర్‌లో గల విశాఖ సేవా సదన్ పాఠశాలలో మంగళవారం దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభమైంది. ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. సంస్కృత ప్రాముఖ్యతను వివరించారు. శిబిరం నిర్వహిస్తున్న సంస్కృత భారతిని అభినందించారు. అనంతరం సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ పది రోజుల్లో సులభంగా సంస్కృతం మాట్లాడడంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సంస్కృతం తెలయడం వల్ల మిగిలిన భాషలు సులభంగా మాట్లాడగలమని చెప్పారు. ఈ నెల 25 వరకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. వయసుతో పని లేదని, ఆసక్తి గల వారు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ధర్మలింగేశ్వరరావు (ఫైల్)

పరవాడ : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో గల దేశపాత్రునిపాలెం శివారు జాజులవానిపాలేనికి చెందిన చోడిపల్లి ధర్మలింగేశ్వరరావు (42) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.. జాజులవానిపాలెంలో కుటుంబంతో నివసిస్తున్న ధర్మలింగేశ్వరరావు హిందూస్థాన్ షిప్‌యార్డులో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 6 గంటలకు డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన మృతుడు 7.30 గంటల సమయంలో వాటర్ ట్యాంకులో నీరు నింపడానికి వెళ్లి మోటారు ఆన్ చేస్తున్న క్రమంలో స్విచ్ బోర్డుకు ప్లగ్ పెడుతున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు జరిపి 9.50 గంటలకు ధర్మలింగేశ్వరరావు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య రమామణి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేరాల నియంత్రణలో తోడ్పాటు అందించాలి
- సమావేశంలో సీపీ త్రివిక్రమ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ట్రాఫిక్) అరీఫుల్లాతో కలిసి నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంతో నేరాల నియంత్రణ విషయంలో తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ-1 ఎం.జాన్‌మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ-2 రాజీవ్‌కుమార్‌తో పాటు వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- ప్రభుత్వ భవనాలు, జగనన్న కాలనీలపై సమీక్ష
- సబ్బవరం పురోగతిపై అధికారులకు ఆదేశాలు జారీ



బోధివలసలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సబ్బవరం: సబ్బవరం మండలంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మంగళవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. బోదువలస గ్రామంలోని జగనన్న కాలనీని, గుల్లేపల్లి గ్రామంలోని నాడు-నేడు పథకంలో చేపడుతున్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను పరిశీలించారు. అదే విధంగా సబ్బవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోర్టు వివాదంలో ఉన్న జగనన్న కాలనీల ఇళ్ల స్థలాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలన్నారు. జగనన్న కాలనీల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోకపోతే మూడు సార్లు నోటీసులు ఇవ్వాలన్నారు. అప్పటికే నిర్మాణాలు చేపట్టకపోతే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, గృహ నిర్మాణ అధికారులకు సూచించారు. మండలంలో నిర్మాణంలో ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సబ్బవరంలోని పీహెచ్‌సీ సమస్యలు అధ్యయనం చేసేందుకు డీఎంహెచ్‌వోను పంపిస్తామని తెలిపారు. పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి మండల పరిషత్ నిధులు మంజూరు చేయాలని ఎంపీపీని కోరారు. సిబ్బంది సమయపాలనపై ఆరా తీశారు. ఆస్పత్రి చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. సబ్బవరం మండలం అన్ని రంగాల్లో ముందుండే విధంగా కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మండలంలో చేపడుతున్న సమగ్ర రీసర్వే పురోగతిని తహసీల్దార్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలో వ్యవసాయ సాగు వివరాలను ఏవో పోతల సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, పీవోపీఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో డెంగ్యూ దూరం



వాడచీపురుపల్లిలో డెంగ్యూ డే ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నాయుడుపాలెంలో సచివాలయ సిబ్బంది ర్యాలీ

- వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో డెంగ్యూపై అవగాహన ర్యాలీ
- వ్యాధి నివారణకు అవగాహన కల్పించిన వైద్యాధికారులు



అడవివరం ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ భాస్కరరావు

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో డెంగ్యూ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.కనకప్పారావు ఆధ్వర్యంలో దోమల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టరు కనకప్పారావు మాట్లాడుతూ డెంగ్యూ దోమలు కుట్టడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. దోమ తెరలు, కిటికీలకు జాలీలు అమర్చుకోవాలన్నారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఫ్రైడే, డ్రైడే పాటించడం ద్వారా డెంగ్యూ దోమలను అరికట్టవచ్చన్నారు. ర్యాలీలో డాక్టర్ క్రాంతికుమార్, అజేయ్‌చంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నాయుడుపాలెం గ్రామ సచివాలయ ఉద్యోగులు డెంగ్యూ డే కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి డెంగ్యూ వలన కలిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. గ్రామ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి పి.రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అడవివరం ఆరోగ్య కేంద్రంలో..

సింహాచలం: డెంగ్యూ వ్యాధిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ ప్రసాద్ నాయక్, డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అడవివరం గ్రామీణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, శరీరంపై దద్దుర్లు డెంగ్యూ వ్యాధి లక్షణాలుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి అడవివరం ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్ అత్యంత ప్రమాదకర స్థాయి అని తెలియజేశారు. వైద్యురాలు డాక్టర్ రాణి మాట్లాడుతూ నీటి నిల్వలు ఉండే ప్రదేశాల్లో దోమలు గుడ్లు పెడతాయని, తద్వారా డెంగ్యూ వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేని విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ ఎస్.మాధవి, డాక్టర్ బి.పార్వతి, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, పీహెచ్‌ఎన్ ఎల్మాదేవి, సూపర్‌వైజర్ పి.వి.నరసింహారావు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తిలో...

డెంగ్యూ వ్యాధిని నివారించే దిశగా ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో వెంకటరావు సూచించారు. డెంగ్యూ దినోత్సవాన్ని పెందుర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. పెందుర్తి పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎంపీపీ నాగమణి, ఎంపీపీ వెంకటరావు మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం సోకిన వాళ్లు వైద్యులను సంప్రదించి మందులు వాడాలన్నారు. పీహెచ్‌సీ అధికారి గిరిష్మా, సీహెచ్‌వో వై.స్వర్ణలత, వైద్య సిబ్బంది ఎస్.వి.రమణ, డి.కొండలరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వెలుగు ఏపీవో రమణ తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. పనుల్లో జాప్యంపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ముందుగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. పెదగొల్లల పాలెం సర్పంచి మోపాడ అప్పారావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపు లైన్లు వేసేందుకు 500 మీటర్ల మేర గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలను తవ్వేశారని, సరి చేసేందుకు పంచాయతీ నుంచి నిధులు సమకూర్చుకోవాలని ఇరిగేషన్ అధికారులు చెప్పడం భావ్యం కాదన్నారు. అమృతపురంలోనూ పనులు మందకొడిగా సాగుతున్నాయని బైలపూడి రామారావు సభ దృష్టికి తీసుకుని వచ్చారు.

- గాలిభీమవరంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా సుమారు 150 ఎకరాల భూమిని సేకరించి, లబ్దిదారులకు నేటికీ పరిహారం ఇవ్వలేదని సర్పంచ్ గొర్లి రాజేష్ తెలిపారు.
- ఆరిపాకలో ప్రభుత్వ భూములు ఉన్నా గ్రామంలో సుమారు 16 మందికి జగనన్న ఇళ్లు ఇవ్వలేకపోతున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ తెలిపారు. దీనిపై తహసీల్దార్ బి.సత్యనారాయణ స్పందిస్తూ ఇప్పటికే రెండు దశల్లో మండలంలోని పేదలందరికీ జగనన్న ఇళ్లు మంజూరు చేశామన్నారు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి దరఖాస్తు చేస్తే మూడో దశలో ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.
- మిషన్ వాత్సల్య పథకంపై ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్‌లు వడ్డాది అప్పలరాజు, కర్రి నర్సింగరావు సభ దృష్టికి తీసుకువచ్చారు.
- శివారు గ్రామాలకు ఫైబర్ నెట్ సేవలు అందడం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని నారపాడు సర్పంచ్ శంకరరావు తదితరులు కోరారు.
- ఐసీడీఎస్ చేపడుతున్న కార్యక్రమాల వివరాలు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు సీడీపీవో లలితకుమారికి సూచించారు.
- పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై ఎంపీపీతో పాటు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీలు దాడి వెంకట ఝాన్సీ లక్ష్మీ రాణి, చొక్కాకుల గోవింద్, ఏవో బాబూరావు, నీటి సరఫరా విభాగం ఏఈ హిమబిందు, నాయకులు బోకం రాము నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, కొటాన రాము తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి

పరవాడ: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్, సందీప్‌సింగ్‌లను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం పరవాడలో సంతకాల సేకరణ చేపట్టారు. మల్లయోధులకు భద్రత కల్పించి నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేయాలని కోరారు. అధికారులు, పోలీసులపై చర్యలు చేపట్టాలన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలన్నారు. మల్లయోధులకు మద్దతుగా చేపట్టిన నిరసన ప్రదేశంలో విద్యుత్‌ను పునరుద్ధరిస్తూ తాగునీరు, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మి, ఎం.జానకి, కె.రత్నం, అచ్చియ్యమ్మ, పద్మ, సంతోషి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.